andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.8 : కనిష్ఠం 23.7

నిర్మల్ జిల్లా వార్తలు

8

గురువారం 10 అక్టోబరు 2024









తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబం బతుకమ్మ : ఎస్పీ

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 9 : తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిబింబం బతుకమ్మ పండగ అని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. బుధవారం భరోసా జిల్లా కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఎస్పీ పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ.. దేవుళ్లకు తీరొక్క పువ్వులతో పూజించే పండగ బతుకమ్మ అన్నారు. బతుకమ్మ పండగ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందన్నారు. బతుకమ్మ పండగను భక్తి శ్రద్ధలతో ఆనందంతో జరుపు కోవాలని పిలుపునిచ్చారు. పోలీసుశాఖకు సంబంధించిన కుటుంబాలు సంబరాల్లో పాల్గొన్నారు. భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, డీఎస్పీ గంగారెడ్డి, డీటీవో సరోజ, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



బతుకమ్మ వేడుకల్లో ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌ల నియామకం



- నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సోమ భీమ్‌రెడ్డి
- సారంగాపూర్ ఏఎంసీ చైర్మన్‌గా అబ్దుల్ ఆది



నిర్మల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) దసరా పండుగ వేళ నిర్మల్, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నిర్మల్ రూరల్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సోమ భీమ్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా ఉద్యమ నేత లక్ష్మణచాందకు చెందిన ఈటెల శ్రీనివాస్, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా స్వర్ణ గ్రామానికి చెందిన అబ్దుల్ ఆది, వైస్ చైర్మన్‌గా బీరవెల్లి గ్రామానికి చెందిన లక్కడి శంకర్‌రెడ్డి నియమితులయ్యారు. రెండు మార్కెట్ కమిటీలకు చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు మరో 16 మంది సభ్యులను నియమించారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకి, డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 9 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపిక అందజేశారు. మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జులతో కలిసి అర్జుమాన్ అలీ హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కలుసుకున్నారు.

నేడు పట్టణంలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 9 : మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలగనుంది. ప్రియదర్శిని నగర్, సాగర్ కాలనీ, మస్తాన్ దుబ్బా ప్రాంతాల్లో సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.


సరస్వతీ నమస్తుతే..

- బాసరలో మూలనక్షత్ర వేడుకలు
- భారీగా అక్షర శ్రీకార పూజలు
- అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు



అమ్మవారి దర్శనం, అక్షర శ్రీకార పూజల కోసం బారులు తీరిన భక్తులు

బాసర, అక్టోబరు 9 : సరస్వతీ నమస్తుతే.. అనే నామస్మరణతో బుధవారం బాసర సరస్వతీ ఆలయం మారుమోగింది. దసరా నవరాత్రి వేడుకల్లో మూలనక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని భారీగా భక్తులు తరలివచ్చారు. మూలనక్షత్రం అక్షర శ్రీకార పూజలకు ప్రసిద్ధి. ఈ పర్వదినాన అమ్మవారి సన్నిధిలో 2230 మంది పిల్లలకు అక్షర శ్రీకార పూజలు జరిపించారు. క్యూలైన్లలో భక్తులకు పండ్లు, పాలు బిస్కెట్లు పంపిణీ చేశారు.దేవస్థానంతో పాటు దాతలు పలుచోట్ల అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. మూల నక్షత్రం సందర్భంగా బుధవారం పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదిలాబాద్ ఎంపీ జీ. నగేష్, ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్, సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ముథోల్ బీఆర్ఎస్ ఇంచార్జీ రమాదేవి, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. రద్దీ దృష్టిలో ఉంచుకొని ఎస్పీ జానకిషర్మిల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.









నిరసన ర్యాలీలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మల్లేష్

‘ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి’

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 9: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఆదిలాబాద్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరును ఖండిస్తూ నల్ల జెండాలతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పునిచ్చి నెలలు గడిచాయని, ఇంకెప్పుడు అమలు చేస్తారని సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేష్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

కరాటే ఆత్మరక్షణ విద్య : జిల్లా అధికారి

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 9: కరాటే ఒక క్రీడనే కాదు అది ఆత్మరక్షణ విద్య అని గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తైక్వాండో అండర్-14, 17 బాల బాలికల పోటీలు నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. కరాటే అంటే అందరు క్రీడగా భావిస్తున్నారని, ఇది ఆత్మరక్షణకు సంబంధించిన విద్య అని గుర్తించాలని పార్థసారథి అన్నారు.జిల్లా స్థాయిలో రాణించిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. ఈ నెల 14న మంచిర్యాలలో జరిగే జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడా కారులను పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్ విరేష్, కృష్ణారావు, వనిత, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం కోసం పథకాలు

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 9: కార్మిక శాఖ ద్వారా కార్మికుల సంక్షేమం కోసం అనేక పథకాలున్నాయని వాటి గురించి తెలుసుకుంటూ సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత లేబర్ ఆఫీసర్ చిట్యాల జగదీశ్ అన్నారు. బుధవారం దస్నాపూర్‌లో గల సూపర్ మార్కెట్ వద్ద కార్మికులకు అవగాహన కల్పించారు. కార్మికశాఖ అందించే సేవలు, పథకాలు వాటి ఉపయోగం, దరఖాస్తు విధానాలను వివరించారు. అనేక ఏళ్లుగా కార్మిక శాఖ కార్మికుల సంక్షేమం కోసం పథకాలను అమలు చేస్తుందని, వాటి గురించి తెలియక లబ్ధి పొందలేక పోతున్నారని జగదీశ్ అన్నారు. కార్మికులు క్షేత్ర స్థాయిలో వీటి గురించి తెలియజేయాలని అవగాహన కార్యక్రమాలు చేపడు తున్నట్లు పేర్కొన్నారు.

కొత్తూర్ దుర్గామాత గుడికి పాదయాత్ర

తలమడుగు, అక్టోబరు 9: మండల కేంద్రంలోనరి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి దుర్గామాత భక్తులు కొత్తూరు గ్రామంలో గల దుర్గామాత ఆలయానికి బుధవారం సాయంత్రం భాజాభజంత్రీలతో పాదయాత్రగా వెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవరాత్రుల సందర్భంగా తలమడుగు గ్రామం నుంచి కొత్తూరు గ్రామంలో గల దుర్గామాత ఆలయానికి పాదయాత్రగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సారే సమర్పించడం జరుగుతుందన్నారు. నమ్ముకున్న వారికి నమ్ముకున్నంతగా కొంగు బంగారంలా అమ్మవారి ఆశీస్సులు అందరికీ లభిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి భక్తులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టగొలుసు మింగిన చిన్నారి

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 9: ఓ పసిపాప ప్రాణాలను రిమ్స్ వైద్యులు కాపాడారు. వివరాలిలా ఉన్నాయి.. గుడిహత్నూర్‌కు చెందిన సత్యపాల్ కూతురు ఏడు నెలల ధృతి అనుకోకుండా తన కాలుకు ఉన్న పట్టుగొలుసు నోట్లో పెట్టుకుని మింగింది. గమనించిన కుటుంబీకులు రిమ్స్‌కు తీసుకు వచ్చారు. అప్పటికే ఆ పాప శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతోంది. వెంటనే డ్యూటీ డాక్టర్లు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హేమంత్ రావు ఎండోస్కోపీ ద్వారా గొంతులోనుంచి గొలుసును తీశారు.

చెట్టును ఢీకొట్టిన కారు

● తండ్రీ కొడుకు దుర్మరణం.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు ● కారు ముందు టైరు పేలినందు వల్లే ఘటన

నర్సాపూర్(జి), అక్టోబరు 9 : అతివేగంతో వెళుతున్న కారు ముందు టైరు పేలడంతో.. అదుపు తప్పి చెట్టుకు ఢీకొని ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన జిల్లాలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని లోకేశ్వరం మండలం మన్మథ్‌కు చెందిన సంగం సురేష్ (28) గ్రామంలోని సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య ప్రియాంక, కుమారుడు సాయివర్షిత్ (6), కుమార్తె తనిష్క ఉన్నారు. సురేష్ తన కుటుంబంతో కలిసి కారులో మంగళవారం తన అత్తగారి ఇల్లు అయిన ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ మండలం కుచలాపూర్‌కు వెళ్లాడు. బుధవారం ఉదయం సురేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో స్వగ్రామానికి బయలు దేరాడు. మార్గమధ్యలో నిర్మల్ జిల్లాలోని నర్సాపూర్ (జి) మండలం నందన్ ఎక్స్‌రోడ్ వద్ద వాహనం ముందు కారు ఒక్కసారిగా పేలిపోయింది. అప్పటికే అతి వేగంతో ఉన్న కారు అదుపు తప్పి ఒక్కసారిగా పక్కనే గల చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో సురేష్, సాయి వర్షిత్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రియాంక, తనిష్కలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో వారిద్దరినీ చికిత్స నిమిత్తం నిర్మల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంలో ప్రియాంక ఎడమకాలు విరగడంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం కుటుంబీకులు హైదరాబాద్‌లోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. సురేష్ అత్తమ్మ లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మునిగెల హనుమాన్లు తెలిపారు.

అదుపు తప్పి ఆటో బోల్తా.. మహిళ మృతి


ఉమా (ఫైల్)

లక్ష్మణచాంద, అక్టోబరు 9 : అదుపు తప్పి ఆటోబోల్తా పడిన ఘటనలో మండలంలోని పొట్టపెల్లి గ్రామానికి చెందిన సోనాడం ఉమా అనే మహిళ దుర్మరణం చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్సై సుమలత, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం 1:30 గంటలకు మల్లాపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ షాదుల్లా అనే వ్యక్తి నిర్మల్ నుండి మల్లాపూర్‌కు తన ఆటో నడుపుకుంటూ వస్తుండగా మార్గమధ్యలో వడ్యాల్ చెరువు కట్టపై చేరుకోగానే అతివేగంగా అజాగ్రత్తగా నడపడం వలన ఆటో అదుపు తప్పి చెరువు కట్ట పైనుండి పక్కకు ఉన్న పొలంలో బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనను చూసిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం నిర్మల్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఈ ఐదుగురికిలో సోనా డం ఉమా అనే వివాహిత పరిస్థితి విష మించి సాయంత్రం మృతి చెందింది. మృతురాలి భర్త భీమన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గ్రామీణ రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి : ఎంపీ గొడెం నగేష్



ముథోల్, అక్టోబరు 9 : కేంద్ర ప్రభుత్వం ద్వారా నియోజకవర్గంలోని గ్రామీణ రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ముథోల్ ఎమ్మెల్యే పవర్ రాంరావు పటేల్ అన్నారు. బుధవారం నియోజకవర్గ కేంద్రమైన ముథోల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నుండి లోకేశ్వరం మండలం వాస్తాపూర్ గ్రామం వరకు సీఆర్ఎఫ్ కేంద్ర ప్రభుత్వ నిధులు రూ. 30 కోట్లతో రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీ నగేష్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి సడక్ యోజన, సీఆర్ఎఫ్ నిధులతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 14 గ్రామాలకు సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు తేవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణరెడ్డి, ముథోల్ మండల బీజేపీ అధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు రాజేష్‌బాబు, నర్సాగౌడ్, సాంప్లీ రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా శరన్నవరాత్రి వేడుకలు

● సరస్వతీ రూపంలో భక్తులకు అమ్మవారు దర్శనం ● ఖానాపూర్‌లో జాన్సన్‌నాయక్ ప్రత్యేక పూజలు


ఖానాపూర్ విద్యానగర్‌లో దుర్గామాత మండపం వద్ద పూజలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ భూక్యానాయక్


మునిపెల్లిలోని దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దుర్గామాత మాలధారులు

ఖానాపూర్, అక్టోబరు 9 : ఖానాపూర్, కడెం మండలాల్లో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా బుధవారం మూల నక్షత్రాన్ని పురస్కరించుకొని అమ్మవారు సరస్వతీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలు దుర్గాదేవి మండపాల వద్ద భక్తులు చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. మండల కేంద్రంలోని విద్యానగర్‌లోని దుర్గాదేవి మండపం వద్ద బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జి భూక్యా జాన్సన్‌నాయక్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ రాథోడ్ రామునాయక్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాజగంగన్న, పట్టణ అధ్యక్షులు గౌరీకర్ రాజు, రైతుబంధు సమితి జిల్లా మాజీ డైరెక్టర్ కొక్కుల ప్రదీప్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శనిగారపు శ్రావణ్, తదితరులున్నారు.

లక్ష్మణచాంద : మండలంలోని మల్లాపూర్, పార్‌పెల్లి, చామన్‌పెల్లి, మున్సిపల్, చింతల్ చందా, లక్ష్మణచాంద, పొట్టపెల్లి, ధర్మారం, పీచర, రాచాపూర్, వడ్యాల్, కనకాపూర్, నర్సాపూర్(డబ్ల్యూ), బాబాపూర్ తదితర గ్రామాల్లో దుర్గామాత విగ్రహం వద్ద బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. విజయ దశమి పండగను పురస్కరించుకుని జరిపే దుర్గాష్టమి వేడుకల్లో భాగంగా ఈ పూజలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పురో హితులు రమేష్‌చారితో పాటు దుర్గామాత మాలధారులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీజేపీ నేతల వినూత్న నిరసన

● సొంతంగా ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరణ
● మున్సిపల్ ఆఫీస్‌లో పారవేత
● మంత్రి హామీతో సమ్మె విరమించిన కార్మికులు


నిర్మల్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో చెత్త పోసిన దృశ్యం

నిర్మల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : గత పది రోజుల నుంచి నిర్మల్ మున్సిపల్ పారి శుద్ధ్య కార్మికులు చేస్తున్న సమ్మె తీవ్రమవుతోంది. అయితే కార్మికుల సమ్మెకు మొదటి నుంచి బీజేపీ మద్దతు ఇస్తూ వారికి సంఘీభావం తెలుపుతోంది. అలాగే కార్మికులకు వేత నాలు చెల్లించాలంటూ బీజేపీ వారికి మద్దతుగా వినూత్న నిరసన చేపట్టింది. బుధవారం బీజేపీ లోక్‌సభ ఇన్‌చార్జి అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్, టౌన్ ప్రెసిడెంట్ సాధం అరవింద్‌లతో పాటు పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలంతా కలిసి కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ ప్రాంతాల్లో రోడ్లపైనా, దుకాణ సముదాయాల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని సేకరించి ట్రాక్టర్ ద్వారా తరలించారు. లోక్ సభ ఇంచార్జి అయ్యన్నగారి భూమయ్య తన సొంత ట్రాక్టర్‌ను చెత్త సేకరణ కోసం విని యోగించారు. దాదాపు నాలుగైదు గంటలపాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సామూ హికంగా పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో చెత్త సేకరణ చేపట్టి ఆ చెత్తను నేరుగా మున్సిపల్ ఆఫీస్ వద్దకు తీసుకువచ్చి అక్కడి రోడ్డుపై పారవేశారు. మొత్తానికి బీజేపీ కార్యకర్తలు ఇలా కొత్త తరహా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మా ట్లాడుతూ... వెంటనే పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఎస్పీ చొరవ.. మంత్రి హామీతో సమ్మె విరమించిన కార్మికులు

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 9 : మంత్రి సీతక్క హామీ ఇవ్వడంతో గత పది రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు తమ సమ్మె విరమిస్తున్నట్టు బుధవారం ప్రకటించారు. ఎస్పీ జానకి షర్మిల మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లింపుపై మంత్రి సీతక్కతో మాట్లాడి కార్మికులకు హామీ ఇప్పించారు. నెల వేతనం వెంటనే చెల్లిస్తామని మిగతాది త్వరలో ఇచ్చేందుకు చర్య తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. సంతృప్తి చెందిన కార్మికులు సమ్మె విరమిస్తున్నట్టు ప్రకటించారు. ఎస్పీకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

నేడు సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం

జైనథ్, అక్టోబరు9: జైనథ్ మండల కేంద్రంలోని జైనథ్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో గురువారం సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు జైనథ్ సహకార సంఘం సీఈవో జి.గంగన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని, ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, మండల సోయా రైతులు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సీఈవో పేర్కొన్నారు.



పల్లకీ ఊరేగింపులో శివసత్తుల పూనకాలు

వైభవంగా ధన్నూర్‌లో శరన్నవరాత్రులు

బోథ్, అక్టోబరు 9: మండలంలోని దన్నూర్ గ్రామంలో గత 35 ఏళ్లుగా దుర్గామాత నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నారు. బుధవారం గ్రామంలో అమ్మవారి పల్లకీ ఊరేగింపును కన్నులపండుగా జరుపుకున్నారు. చుట్టూ పక్కల గ్రామాల నుంచి భారీగా భవానీ మాలధారులు, భక్తులు తరలివచ్చారు. శివసత్తులు నెత్తిన బోనం ఎత్తుకుని నృత్యాలు చేస్తుంటే.. మాల వేసుకున్న స్వాములు, మహిళలు సైతం శివసత్తులను అనుకరించారు.

● గ్రామాల్లో కుంకుమార్చన పూజలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం మండల కేంద్రంలోని పర్దాన్‌గూడలోని శ్రీ గొండి ధర్మ గురు హీరాసుక్క దుర్గమాత మండపం వద్ద సామూహిక కుంకుమార్చన పూజలను స్థానిక అవినాష్ మహరాజ్ ఆధ్వర్యంలో మహిళలు ఘనంగా నిర్వహించారు.

● సిర్సన్న(జె)లో సామూహిక కుంకుమార్చనలు

జైనథ్: మండలంలోని ఆయా గ్రామాలతో పాటు దేవి నవరాత్రుల ఉత్సవంలో భాగంగా బుధవారం మండలంలోని సిర్సన్న (జె) గ్రామంలో సామూహిక కుంకుమ అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నవశక్తి దుర్గా మండపంలో దుర్గాదేవికి మహిళలు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● దళితవాడలో అంగరంగ వైభవంగా..

తాంసి: మండలంలోని ఆయా గ్రామాలలో బుధవారం కుంకుమార్చన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని దళితవాడలో ఆ కాలనీ మహిళలు నూతనంగా స్థాపన చేసిన శారదా మాత వద్ద కుంకుమార్చన చేశారు. అలాగే పొన్నారి, హస్నాపూర్, జామిడి, కప్పర్ల, గోట్కూరి గ్రామాలలో కూడా మహిళలు కుంకుమార్చనలు చేశారు.

డీజేలు వినియోగిస్తే చర్యలు : సీఐ

ఇచ్చోడ, అక్టోబరు, 9: దసరా ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా అనుమతి లేకండా మైకులు పెట్టొద్దని ఇచ్చోడ సర్కిల్ సీఐ భీమేష్ అన్నారు. బుధవారం దసరా, దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులతో ఇచ్చోడ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. డీజేల వినియోగంపై ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను పాటించలన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈనెల 11న శుక్రవారం నిర్వహించే అమ్మవార్ల ఊరేగింపులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సీఐ పేర్కొన్నారు.

క్లోరినేషన్‌కు నోచుకోని ట్యాంకు!

● స్థానిక ప్రజలకు తప్పని అవస్థలు ● అయినా.. పట్టింపు లేని అధికారులు

భీంపూర్, అక్టోబరు 9: గ్రామాల్లోని పరిసరాలతో పాటు ప్రజలకు తాగునీరు అందించే వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి నీటిని గ్రామ ప్రజలకు ప్రతీరోజు అందించాలి. కానీ మండలంలో పారిశుధ్య పనులను పక్కన పెడితే.. ప్రతీరోజు తాగే నీటిని శుభ్రపరచక పోవడంతో ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశాలు లేకపోలేదంటున్నారు. మండలంలోని నిపాని గ్రామంలో సుమారు ఏడాది కాలంగా వాటర్ ట్యాంకును శుభ్రపరచడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ట్యాంకు లోపల పూర్తిగా నాచు, ఇతర చెత్తాచెదారాలు పడుతున్నాయని, అయినా.. వాటిని శుభ్రపరిచే నాథుడే కరువయ్యాడని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలకేంద్రానికి వెళ్లే దారిలోనే ఉన్న ఈ గ్రామం పట్ల ఎవరూ దృష్టి సారించడం లేదని నిపాని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆ ట్యాంకు నీళ్లే తమకు తాగునీరు అని, చెత్తాచెదారంతో ఉన్న నీటిని తాగుతుండటంతో వ్యాధులు ప్రబలే ఆస్కారం లేకపోలేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఏడాది కాలంగా శుభ్రతకు నోచుకోని వాటర్ ట్యాంకులను శుభ్రపరిచి గ్రామస్థులకు స్వచమైన తాగునీటిని అందించాలని స్థానికులు కోరుతున్నారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నారు.



నిపానిలో శుభ్రతకు నోచుకోని వాటర్ ట్యాంకు



నల్లాల ద్వారా సరఫరా అవుతున్న కలుషిత నీరు

సంక్షిప్త సమాచారం

ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

ఉట్నూర్, అక్టోబరు 9: రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఏజెన్సీ ప్రాంతాల వైద్యసేవలపై సమీక్ష సమావేశం నిర్వహించి జిల్లాల ఆసుపత్రులను తనిఖీ చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో కమిషనర్ ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందులో సూపరింటెండెంట్ జాదవ్ ఉపేందర్, డాక్టర్ మహేందర్, కపిల్‌కుమార్, తదితరులున్నారు.

● బజార్‌హత్నూర్‌లో పీహెచ్‌సీ తనిఖీ

బజార్‌హత్నూర్: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు డీఎంహెచ్‌వో మనోహర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని రూములను పరిశీలించి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత పలు రికార్డులను పరిశీలించారు. కాగా, స్థానిక వైద్యుడు భీంరావు ఇక్కడి నుంచి ఇద్దరు ఫార్మాసిస్టులు బదిలీపై వెళ్లారని, ప్రస్తుతం ఇక్కడ ఎవరూ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని ఆయనకు తెలుపారు.

రేపు సామూహిక నిమజ్జనం

ఉట్నూర్, అక్టోబరు 9: ఉట్నూర్‌లో గత ఏడు రోజులుగా పూజలు అందుకుంటున్న దుర్గామాతలు, బతుకమ్మలకు శుక్రవారం వరకు తొమ్మిది రోజుల పూజలు అందుకుని సామూహిక నిమజ్జనం నిర్వహించనున్నారు. ఈ మేరకు హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు కొండేరి రమేష్, ప్రధాన కార్యదర్శి ముత్యాల సంజీవ్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బొజ్జుపటేల్, ఎంపీ నగేష్‌తో పాటు అధికారులు హాజరుకానున్నారు. కాగా, మండల కేంద్రంలో మొత్తం 16 దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించారు.

మైనార్టీల బంద్ ప్రశాంతం

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 9: ప్రవక్త మహ్మద్‌పై యతి నరసింహనంద్ సరస్వతి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన ఆదిలాబాద్ పట్టణ బంద్ బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఇందులో భాగంగా ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో తెరిచి ఉన్న దుకాణాలను మూయించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎస్పీ గౌస్‌ఆలం సైతం పట్టణంలోని పర్యటించి పరిశీలించారు.



ఆదిలబాద్‌లో మూసి ఉన్న దుకాణాలు

జిల్లాలో ఘనంగా బతుకమ్మ సంబురాలు

● కలెక్టరేట్ ఆవరణలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు ● పాల్గొన్న కలెక్టర్, అధికారులు ● ..ఉట్నూర్‌లో ఐటీడీఏ పీవో



మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్



ఉట్నూర్‌లో బతుకమ్మలతో ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 9: జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, డీడబ్ల్యూవో సబిత, ఉద్యోగులు పాల్గొన్నారు. ముందుగా బతుకమ్మకు పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఉద్యోగులతో కలిసి కలెక్టర్ బతుకమ్మ ఆడారు. అలాగే జిల్లా కోర్టు ఆవరణలో బతుకమ్మ సంబరాల్లో జిల్లా న్యాయాధికారి పాల్గొన్నారు. ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఇందులో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

● ఉట్నూర్ ఐటీడీఏ ఆవరణలో..

ఉట్నూర్: ఒక్కేసి.. పువ్వేసి చందమామ అంటూ మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఒక్కచోట చేర్చారు. వాటి చుట్టూరా తిరుగుతూ ఒక్కేసి పువ్వేసి చందమామ, బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆడిపాడారు. ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా హాజరై బతుకమ్మలకు పూజలు చేశారు. అనంతరం మహిళ ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో కలిసి సరదాగా పాటలు పాడుతూ ఆడారు. ఈ సందర్భంగా ఆడపడుచులకు ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా బతుకమ్మ పండుగ శుభాకాంక్షలను తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో మాసుమా, ఐటీడీఏ ఉద్యోగులు మేస్రం చాయ, స్వర్ణలత, శ్యామల, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● బోథ్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో..

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు గౌరమ్మ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో బోథ్, ధన్నూర్ ఐసీడీఎస్ సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఇందులో సూపర్‌వైజర్ లలిత, మంజుల, శారదలతో పాటు అంగన్‌వాడీ టీచర్లు శాంత, చౌహాన్‌అనిత, ఈశ్వరి, సుశీల, అంగన్‌వాడీ హెల్పర్లు పాల్గొన్నారు.



కైలాస్ టేకిడి ఆలయం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బోథ్ ఎమ్మెల్యే అనిల్

'అటవీ అనుమతులు రాగానే రోడ్డు పనులు'

బోథ్, అక్టోబరు 9: తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న కైలాస్ టేకిడి శివాలయాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే అనిల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను చేపట్టారు. అయితే ఆలయం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.12 కోట్లతో ప్రతిపాదనలు పంపించడం జరిగిందని, అటవీ శాఖ అనుమతులు రాగానే రోడ్డు నిర్మాణ పనులను చేపడతామన్నారు.

● నిగిని గ్రామ సమస్యలను పరిష్కరిస్తా

బోథ్: నిగిని గ్రామంలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. బుధవారం గ్రామంలో ఆయన పర్యటించారు. అనంతరం గ్రామస్థులు స్థానిక సమస్యలను వివరించారు. తర్వాత జగదాంబ దేవి సంతు సేవాలాల్ మహరాజ్ ఆలయాన్ని దర్శించుకున్నారు.


● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నేరడిగొండ: మండలకేంద్రంలో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆయన నివాసంలో పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. తలమడుగు మండలం ఖోడద్ గ్రామానికి చెందిన జి.నరేష్‌కు, ఇచ్చోడ మండలం కామగిరికి చెందిన బి.లక్ష్మణ్‌కు మంజూరైన చెక్కులను అందజేశారు.

గోవింద నామస్మరణతో మార్మోగిన తలమడుగు

● గ్రామ పుట్టింటి ఆడ బిడ్డలతో వేంకటేశ్వర స్వామివారికి మకర తోరణం, అలంకరణ అభరణాల ఏర్పాటు

తలమడుగు, అక్టోబరు 9: మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామికి తలమడుగు గ్రామ పుట్టింటి బిడ్డలు ఆలయకమిటీ భక్తుల సహకారంతో స్వామి వారికి మకర తోరణం, అలంకరణ ఆభరణాలు ఏర్పాటు చేసి వేద పండితుల వేద మంత్రాల మధ్య స్వామివారికి అలంకరించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలను భాజాభజంత్రీలతో పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. గోవింద నామస్మరణతో తలమడుగు గ్రామం మార్మోగింది. గ్రామానికి చెందిన ప్రతీ ఇంటి ఆడపిల్లలు ఇతర గ్రామాలకు, రాష్ట్రాలకు, విదేశాలకు వెళ్లినప్పటికీ ఈ పండుగకు తరలిరావడం విశేషం. అనంతరం ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. సార్వజనిక్ ట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఇందులో ఆలయ ప్రధాన అర్చకుడు నేరేళ్ల కళ్యాణ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, కాటిపల్లి వసంత్‌రెడ్డి, పద్మాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, శ్రీకాంత్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



స్వామికి అలంకరించిన మకరతోరణం, ఆభరణాలు

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

తలమడుగు, అక్టోబరు 9: రేషన్ డీలర్‌లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రాజమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని పల్లి(బి), పల్లి(కె), సాయి లింగీ తదితర గ్రామాల్లోని రేషన్ షాపులను ఆయన ఆకస్మింగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతీఒక్కరికి రేషన్ బియ్యం అందించాలన్నారు.

బోథ్‌లో ఉపాధి హామీ పనుల పరిశీలన

బోథ్, అక్టోబరు 9: మండలంలోని వర్జర్ కేశవ్‌గూడ, పిప్పల్‌దరి గ్రామాలలో ఉపాధి హామీ పనులను బుధవారం కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. దీనిలో భాగంగా మంజూరైన నిధుల విషయమే ఆరా తీశారు. అలాగే గ్రామంలో వివిధ రకాల పెన్షన్లు అందుతున్నాయా? అనే విషయాన్ని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలువురు లబ్ధిదారులు రూ.2016 బదులు రూ2వేలు మాత్రమే ఇస్తున్నారని కేంద్ర బృందానికి వివరించారు. వీరి వెంట డీఆర్‌డీవో కుటుంబరావు, ఎంపీడీవో జీవన్ రెడ్డి, ఉపాధిహామీ ఏపీఎం జగదేవ్‌రావు, తదితరులున్నారు.

● భీంపూర్‌లో ఉపాధి పనుల పరిశీలన

భీంపూర్: మండలంలోని గుంజల, కైర్‌గూడ, ఇందూర్‌పల్లి గ్రామాలలో బుధవారం నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రఘునాథ్, నాగరాజ్, డీఆర్‌డీఏ ఏపీడీ కుటుంబరావు, ఎంపీడీవో గోపాల కృష్ణరెడ్డిలతో కలిసి ఉపాధి హామీ పనులతో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, పలు రికార్డులను పరిశీలించారు.

హైదరాబాద్‌కు తరలిన డీఎస్సీ అభ్యర్థులు

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 9: డీఎస్సీ-2024లో ఎంపికైన అభ్యర్థులను విద్యాశాఖ ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌కి తరలించారు. ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. అభ్యర్థుల వెంట డీఈవో ప్రణీత, ఎంఈవోలు, సీనియర్ హెచ్‌ఎంలు, పీడీలు వెళ్లారు. జిల్లాలో మొత్తం 324 పోస్టులు ఉంటే 266 మందిని ఆయా పోస్టులకు ఎంపిక చేశారు. వీరందిరికీ నియామకపత్రాలు అందిస్తారని డీఈవో తెలిపారు.

మున్సిపల్ శాఖ సెక్రెటరీని కలిసిన కంది

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 9: తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ శాఖ స్పెషల్ సెక్రటరీ దాన కిషోర్‌ను ఆదిలాబాద్ అసెంబ్లి కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జీకంది శ్రీనివాస్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి ఆదిలాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం నిధులు కేటాయింపుపై ఆయన చర్చించారు. అయితే నిధుల విడుదలకు హామీ ఇచ్చిన ఆయనకు కంది శ్రీనివాస్‌రెడ్డి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.



సెక్రెటరీకి వినతిపత్రం అందజేస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

ఉట్నూర్‌లో బీజేపీ విజయోత్సవం

ఉట్నూర్, అక్టోబరు 9: హర్యానా రాష్ట్రంలో బీజేపీ మూడోసారి ఘన విజయం సాధించడంతో మండల కేంద్రంలో స్థానిక పార్టీ నాయకులు విజయోత్సవం నిర్వహించుకున్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాష్ట్ర నాయకులు ఆధ్వర్యంలో బాణాసంచా కాలుస్తూ మిఠాయిలు పంపిణీ చేశారు. రాథోడ్ కేసు మట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఈ విజయం చెంపపెట్టులాంటిదన్నారు. ఇందులో కొండేరి రమేష్, సీపతి లింగాగౌడ్, వాఘ్మారే జగ్జీవన్, రాథోడ్‌శేషరావు, దేవిదాస్, బింగి వెంకటేష్, సల్గారే రవీందర్, బొడ్డు కిరణ్, కుటికల ఆశన్న, తదితరులున్నారు.



ఉట్నూర్‌లో బాణాసంచా కాలుస్తున్న బీజేపీ నాయకులు